19042024-MAI-04_Layout 1 4/19/2024 1:20 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

# ఎడారిలో వరదలు

**పచ్చగా** కళకళలాడిన ప్రాంతాలు కొన్ని ఎడారులవుతుంటే, ఎడారుల్లో పచ్చదనం చిగురిస్తున్నది. మంచుకొండలు కరిగి నీరైపోతున్నాయి. ఇసుక పర్రల్లో వరదలు పోటెత్తుతున్నాయి. ప్రకృతి తారుమారవుతుండటం మనం గమనించవచ్చు. ఇది మానవ కల్పితమా లేక ప్రకృతి ప్రకోపమా? ఎక్కడ చూస్తే అక్కడ ఇసుక తిప్పలు పరచుకుని ఉండే దుబాయిలో కుండపోతగా వర్షం కురవడం ఏమిటి? వానొచ్చే, వరదొచ్చే అని నగరాలు అతలాకుతలం కావడం ఏమిటి? విమానాల రాకపోకలు రద్దు చేశారంటే పరిస్థితి తీవ్రత ఎంతో అర్థం చేసుకోవచ్చు. ఆ దృశ్యాలను చూసిన ప్రపంచం విస్తుపోయింది. ఎడారి నగరమైన దుబాయిలో కేవలం 24 గంటల్లో 25 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఇది ఏడాది మొత్తంలో నమోదయ్యే వర్షపాతం కంటే ఎక్కువ. 75 ఏండ్ల తర్వాత దుబాయి ఈ స్థాయి వర్షాన్ని చూసిందంటున్నారు. రహదారులు వడిగా పారే నదులయ్యాయి. భవనాలు నీటిలో తేలే పడవలయ్యాయి. ఎటుచూసినా వరదనీరే ఆవరించి ఉన్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలవుతున్నాయి. ప్రపంచంలోనే ఎత్తయిన భవనంగా ప్రసిద్ధి పొందిన బుర్జ్ ఖలీఫాపై పిడుగులు పడుతున్న దృశ్యాలు ప్రకృతి ముందు మానవశక్తి అల్పత్వాన్ని ఎత్తిచూపాయి.

ఇంతకూ ఈ ఉత్పాతం ఎందుకు వచ్చిపడిందనే తర్జనభర్జనలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయి. కృత్రిమ వర్షాల కోసం జరిపిన క్లౌడ్ సీడింగ్ ప్రక్రియ వికటించి ఆకాశం భళ్లున బద్దలైందని మొదట వార్తలు వచ్చాయి. అయితే ఇవి కేవలం ఊహాగానాలేనని, తీవ్ర అల్పపీడనం ఫలితంగానే ఎడతెరిపి లేకుండా వానలు పడ్డాయని వాతావరణ శాస్త్రజ్ఞులు తేల్చిచెప్పారు. దుబాయిలో ఆవిష్కృతమైన అనూహ్య విలోమ దృశ్యాలు రాబోయే పెను విపత్తుకు నిదర్శనమని వారు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వర్షాల తీవ్రత పెరుగుతుండటం తెలిసిందే. కాలుష్యం కారణంగా వాతావరణం వేడెక్కడమే అందుకు కారణం. అధిక ఉష్ణోగ్రతల వల్ల తేమ పెరిగిపోతుంది. దానికి అల్పపీడనం తోడైతే భారీవర్షాలు కురుస్తాయి. ఇలాంటి ఉత్పాతాల వల్ల 2050 నాటికి ప్రపంచ ఆదాయం ఏటా సగటున 19 శాతం వరకు దెబ్బ తింటుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఆర్థికభారం ప్రభుత్వాలకో, కార్పొరేట్లకో పరిమితం కాదు. పౌరులకు వ్యక్తిగత స్థాయిలోనూ నష్టం కలుగుతుందని హెచ్చరిస్తున్నారు. దుబాయి జోరువానల్ని ప్రమాద ఘంటికలుగా భావించి భూతాపం తగ్గింపునకు ప్రపంచ దేశాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

2050 నాటికి భూతాపం తగ్గింపు కోసం 6 లక్షల కోట్ల డాలర్లు ఖర్చు చేయాలని ప్యారిస్ వాతావరణ ఒప్పందం నిర్దేశిస్తున్నది. ఆ మొత్తంతో దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే వాటిల్లే నష్టం అంతకు ఆరురెట్ల కంటే ఎక్కువగా, అంటే 38 లక్షల కోట్ల డాలర్ల మేరకు ఉంటుందని నేచర్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం తెలిపింది. భూతాపం వల్ల దుబాయి తరహా జలవిలయాలే కాదు, ఇతర నష్టాలూ ఉంటాయి. ధ్రువాల వద్ద మంచు కరిగి సముద్రమట్టం పెరగడం వల్ల తీరాల్లోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. వ్యవసాయంలో అధిక ఉష్ణం వల్ల చీడపీడలు పెరిగిపోయి దిగుబడి తగ్గిపోతుంది. ఇదంతా మానవ కల్పిత పర్యావరణ వినాశనం వల్లనే! చికిత్స కన్నా నివారణే ముఖ్యమన్న సూక్తి వైద్యంలోనే కాదు వాతావరణం విషయంలోనూ వర్తిస్తుంది. పారిస్ ఒప్పందం లక్ష్యాల సాధనకు ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా కృషి చేయడం అవసరం.

# అనుసంధానం పేరిట అన్యాయం

**తెలంగాణ ఉద్యమం పల్లెల్లోకి చొచ్చుకుపోవటానికి, విస్తరించటానికి, బలపడటానికి నీళ్ల నినాదమే ఆయుధం అయింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు నీళ్లే ఆధారం. రైతులు, కూలీలు, కులవృత్తులు, చేతివృత్తులు, సబ్బండ జాతులన్నీ కలిస్తేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ. ఈ వ్యవస్థకు మూలం వ్యవసాయం. నీళ్లుంటేనే పల్లె పచ్చగా ఉంటుంది. నీళ్ల విలువేంటో తెలిసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బడ్జెట్‌లో ఏటా రూ.25 వేల కోట్ల నిధులు ప్రాజెక్టులకు కేటాయించి, కోటి ఎకరాల మాగాణికి జీవం పోసిండు. గోదావరిలో మనకొచ్చే 954 టీఎంసీల వాటాలో చుక్క నీళ్లు కూడా వృథాగా పోకుండా జల ప్రాజెక్టులను మలిచిండు. ఇప్పుడు నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను బలవంతంగా తీసుకుపోయి కావేరిలోకి మళ్లించి దిగువ రాష్ట్రాల్లో ఓట్ల సాగుకు మోదీ సర్కారు తహతహలాడుతున్నది.**



**వర్ధెల్లి వెంకటేశ్వర్లు**



కృష్ణా నదిలో 79 శాతం పరీవాహక ప్రాంతం తెలంగాణలోనే ఉంది. అంటే ముప్పావు వంతు జలాల వాటా తెలంగాణకు దక్కాలె. కృష్ణానది నీటి లభ్యత 811 టీఎంసీలు. ఈ లెక్కన కనీసం 600 టీఎంసీలు తెలంగాణకు రావాలె. కానీ, అప్పటి హైదరాబాద్ ప్రభుత్వం తెలంగాణకు 161 టీఎంసీలు కేటాయించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాక ఈ వాటాను 111కు కుదించింది. పోయిన నీళ్లు ఎలాగు పోయాయి, కనీసం ఉన్న గోదావరి జలాలనైనా పోతం చేసుకుందామంటే కేంద్రం తెరమీదకు తెచ్చిన నదుల అనుసంధానంతో మళ్లీ తెలంగాణను ఎండబెట్టే కుట్రకు తెరదీసినట్టు కనబడుతోంది.

ఒడిశా రాష్ట్రంలోని మహానదిలో 360 టీఎంసీలు, గోదావరిలో 530 టీఎంసీలు మొత్తం కలిసి 890 టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయని కేంద్ర జల సంఘం లెక్కలు గట్టింది. నిబంధనల ప్రకారమైతే.. ఏ నది జలాలైనా పరీవాహక ప్రాంత ప్రజల ప్రస్తుత, కనీస భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని లెక్కలు గట్టాలి. అంటే మరో 30 ఏండ్ల నాటికి పెరగనున్న జనాభా, వారికి అవసరమైన నీటి పరిమాణాన్ని అంచనా వేసి నిర్ధారించాలి. ఆ తర్వాతే మిగులు జలాలను గుర్తించాలి. కానీ, కేంద్రం మాత్రం 20 ఏండ్ల కిందట 75 శాతం నీటి లభ్యతతో తీసిన లెక్కలతో మిగులు జలాలు చూపిస్తున్నది. ఆ లెక్కలు ఇప్పటి నీటి లభ్యతతో ఎలా సరిపోలుతాయి? ఈ తొండి లెక్కలతోనే మహానదిని గోదావరితో కలిపి, గోదావరిని కృష్ణానది మీదుగా కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న కావేరి నదికి అనుసంధానం చేయాలని చూస్తున్నది.

నిజానికి అవి తెలంగాణకు ఎవరూ దిక్కు లేనప్పుడు తీసిన లెక్కలు. కేసీఆర్ వచ్చాక లెక్క మారింది. భవిష్యత్తు అవసరాలపై కేసీఆర్‌కు పక్కా ప్రణాళిక ఉంది. నిర్మాణం పూర్తయిన ప్రాజెక్టుల కింద 433.04 టీఎంసీలు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల కింద 475.79 టీఎంసీలు, చేపట్టబోయే ప్రాజెక్టుల కింద 45.38 టీఎంసీలు మొత్తం కలిపి 954 టీఎంసీల జలాలు మనకు అవసరమవుతాయని నిగ్గు తేల్చారు. ఇంక మిగులు జలాలు ఎక్కడున్నాయి. గోదావరిపై కాళేశ్వరం, కంతనపల్లి, తుపాకుల గూడెం, దుమ్ముగూడెం, దేవాదుల ప్రాజెక్టులకు రూపం వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు చేతికి అందింది. గోదావరి నీళ్ల వినియోగం పెరిగింది. నదిని ఎత్తిపోసి కోటి ఎకరాలకు కేసీఆర్ నీళ్లు అందించారు. కాంగ్రెస్ పాలకులకు ఇంకా జలాల గణాంకాలు అర్థం కావటం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టుల గేట్లకు మూతపెట్టి.. కాంగ్రెస్ పార్టీ గేట్లు ఎత్తటం ఎట్లా అనే అంశం వద్దనే వారు ఆగిపోయారు.

**నదుల అనుసంధానం అనేది ఇప్పటి ముచ్చటేమీ కాదు. 1960లో తొలిసారి ఈ అంశం చర్చకు వచ్చింది. 4,200 కిలోమీటర్ల పొడవైన హిమాలయ ప్రాంత కాల్వలను, 9,300 కిలోమీటర్ల పొడవైన దక్షిణ ప్రాంత కాల్వలను ఢిల్లీ పట్నాల వద్ద కలపాలని కెప్టెన్ దస్తూన్ తొలిసారి ప్రతిపాదించారు. ఆ తర్వాత 1972లో అప్పటి కేంద్ర మంత్రి, ఇంజినీరు కేఎల్ రావు.. కావేరి-గంగా నదులను అనుసంధానం చేయాలనే ప్రతిపాదన చేశారు.**

సోన్, నర్మద, పెన్‌గంగ, ప్రాణహిత, గోదావరి, కృష్ణా నదుల మీదుగా కావేరి నదితో అనుసంధానం చేయాలని సూచించారు. ఈ రెండు కూడా ఆచరణ సాధ్యం కాదని అప్పట్లోనే పార్లమెంట్ తేల్చి చెప్పింది. అప్పట్లోనే సాధ్యం కాదని తేల్చిన అంశాన్నే మోదీ ప్రభుత్వం పట్టుకొని వేలాడుతున్నది.

గోదావరి నీళ్లను తరలించాలంటే.. ముందుగా మహానదిని తీసుకొచ్చి గోదావరితో అనుసంధానం చేయాలి. మహానది మిగులు జలాలను గోదావరి నీళ్లతో కలపాలి. అది నిబంధన. కానీ, మహానదిలో అసలు మిగులు జలాలే లేవని, లేని మిగులు నీళ్లను తరలిస్తే ఊరుకునేది లేదని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తెగేసి చెప్పారు. అయినా మోదీ సర్కార్ ఆగటం లేదు. దక్షిణాది రాష్ట్రాల్లో జల యుద్ధాలు సృష్టించి, నెత్తుటేర్లు పారించి, ఆ రక్తంతో కమలం పూల సాగుబడి చేయాలని మోదీ పాచికలు వేస్తున్నారు. రాష్ట్రాల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోకుండా మొండిగా నదులను అనుసంధానం చేసి తెలంగాణ మాగాణాన్ని ఎండబెట్టి గోదావరి జలాలను కృష్ణా, కావేరిలకు పంపించే ప్రయత్నాన్ని తెలంగాణ సమాజం ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించదు.

మోదీ దక్షిణాది రాష్ట్రాల మధ్య నీటి కయ్యాలు పెట్టే బదులు పశ్చిమ కనుమలపై దృష్టి పెట్టాలి. పశ్చిమ కనుమల్లో ఏటా కుంభవర్షాలే కురుస్తాయి. అది స్థిరమైన వర్షపాతం. ఏటా వేల కోట్ల క్యూసెక్కుల జల ప్రవాహం ఉంటుంది. ఇందులో 90 శాతం నీళ్లు పశ్చిమంగా ప్రవహించి వృథాగా అరేబియా సముద్రంలో కలుస్తున్నాయి. పైగా అంతా గుట్టలు, లోయలతో కూడిన ప్రాంతం కాబట్టి వ్యవసాయ భూమి, నివాస ప్రాంతాలు కూడా తక్కువే. ఈ నీళ్లకు కట్టలు వేసి, మలిపితే భారత ఉపఖండాన్ని సస్యశ్యామలం చేయవచ్చు. మోదీ ముందుగా ఈ జలాల వినియోగంపై దృష్టి పెట్టాలి. వీటిలో 25 శాతం వంతు నీళ్లను ఒడిసిపట్టుకుని, తూర్పు దిశగా తీసుకువచ్చి మహానదిలోకి మళ్లిస్తే ఆ జలాలు గోదావరి, కృష్ణాల మీదుగా కావేరి నదిని తడుతాయి. అప్పుడు నాలుగు నదులేమిటి? దక్షిణ భారతంలోని నదులన్నింటినీ అనుసంధానం చేయవచ్చు.

**లేఖ**

## పోస్టింగ్‌లు ఇవ్వరా సారూ?

**గురుకుల** సొసైటీల్లో బోధన సిబ్బంది కోసం చేపట్టిన నియామకాల ప్రక్రియ అడుగడుగునా లోపాలమయంగా మారింది. ఎంపికైన అభ్యర్థులకు ఫిబ్రవరిలో నియామక పత్రాల పంపిణీ చేసింది. ఆ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారే గానీ పోస్టింగ్ ఆర్డర్లను మాత్రం ఇప్పటికీ ఇవ్వలేదు. నియామకపత్రాల్లో పొందుపరిచిన అరవై రోజుల గడువు ముగియడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. జేఎల్, డీఎల్ మొదలైన పోస్టులకు ఎంపికైన వారికి నియామకపత్రాల్లో ఇచ్చిన గడువు మే నెలతో ముగుస్తుంది. ట్రిబ్ అధికారుల ఉదాసీనత, ఆచరణలో స్పష్టత కొరవడటం, ఆరోహణ పద్ధతిలో నియామక ప్రక్రియను చేపట్టకపోవడంతో బ్యాక్‌లాగ్ పోస్టులు ఏర్పడుతున్నాయి. బ్యాక్‌లాగ్ పోస్టులు లేకుండా భర్తీ ప్రక్రియ చేపట్టాలని ఉద్యోగార్థులు ప్రస్తుత ప్రభుత్వానికి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం శూన్యం. దీంతో కొంతమంది కోర్టు మెట్లెక్కారు. పర్యవసానంగా మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో నియామకాలపై ఓ కమిటీని ఏర్పాటు చేశారు. కానీ, నేటికీ ఆ కమిటీ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. ఇదిలా ఉంటే ప్రస్తుతం గురుకుల విద్యా సొసైటీల్లో బోధన సిబ్బందిగా విధులు నిర్వర్తిస్తున్న టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్, పీడీలకు పదోన్నతి కల్పించి, బదిలీలు చేపట్టాకే నూతనంగా ఎంపికైన వారికి పోస్టింగ్‌లు ఇవ్వాలనే డిమాండ్ తెరపైకి వస్తున్నది. ఎన్నికల కోడ్ ఉన్నందున ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేమని ప్రభుత్వం వాదిస్తున్నది. అయితే వాస్తవానికి పదోన్నతులు, బదిలీలకు ఎన్నికల కోడ్‌తో సంబంధం ఉండదు. అది సంస్థాగతంగా, అంతర్గతంగా జరిగే ప్రక్రియ. ఎన్నికల కోడ్ పేరిట కాలయాపన చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదు. మరోవైపు గురుకుల బోర్డులో కీలకమైన చైర్మన్ సహా అనేక పదవుల నియామకాల్లో ముందడుగు పడటం లేదు. దీనివల్ల పాలనాపరమైన, అతిముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతున్నది. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ ఉద్యోగార్థులకు న్యాయం చేకూరేలా నిర్ణయం తీసుకోవాలి. నూతన విద్యా సంవత్సరం ఆరంభం కాకముందే నియామకపత్రాలు పొందినవారికి పోస్టింగ్‌లు ఇవ్వాలి.

*- నియామకపత్రాలు పొందిన అభ్యర్థులు*

**ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పాటు కావాలనే ప్రజల బలమైన ఆకాంక్ష వెనుక ఓ సుదీర్ఘ చారిత్రక నేపథ్యం ఉన్నది. ఇది ఒక్క రోజులోనో, ఒక్క సంఘటనతోనో, కొద్దికాలపు వివక్షతోనో ఏర్పడిన భావన కాదు. రాష్ట్రం ఏర్పాటు కోసం చావోరేవో అన్నరీతిలో జనం కొట్లాడటం వెనుక 150 ఏండ్ల దుఃఖం ఉన్నది. ఒక దాని తర్వాత ఒకటిగా జరిగిన అన్యాయాలన్నీ, ఒకదానికి ఒకటి తోడై ప్రజలు ఉద్యమించక తప్పని పరిస్థితిని సృష్టించాయి.**

# తెలంగాణ మెడపై యూటీ కత్తి



**జి.రాజేష్ నాయక్**
96035 79115

విశ్వ ప్రయత్నాలు విఫలమైన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో వ్యూహాత్మకంగా, ప్రజాస్వామ్యయుతంగా సాగిన మలిదశ పోరాటం.. ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చే వరకు నిరాటంకంగా సాగింది. అలా కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సిద్ధించింది. స్వరాష్ట్రం వచ్చిందని సంబురపడితే సరిపోదు, సాధించిన దానితో సంతృప్తి చెందితే పొరపాటే అవుతుంది. ఆ పొరపాటు కేసీఆర్ చేయలేదు. సీమాంధ్ర నాయకులు ఎన్నో చెప్పారు. తెలంగాణ వస్తే కరెంటు ఉండదన్నారు. నక్సలిజం పెరిగిపోతుందన్నారు. అన్నదాతలకు ఆత్మహత్యలే శరణ్యమని భయపెట్టారు. శాపాలు, జోస్యాలు కలగలిసిన వారి అంచనాలను తలకిందులు చేసి, తెలంగాణను ఓ అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దాలనేదే ఉద్యమం అసలు లక్ష్యం. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ విజయతీరాలకు చేర్చారు.

తెలంగాణ రాష్ట్ర అత్మ, తెలంగాణకు మణిహారం హైదరాబాద్. రాష్ట్రానికి ఎంతో కీలకమైన నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. హైదరాబాద్‌లో ఐటీ అభివృద్ధికి నాటి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. ప్రపంచ దిగ్గజ సంస్థలైన గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, క్వాల్కమ్ లాంటివి వాటి ప్రధాన కార్యాలయాలను హైదరాబాద్‌లోనే నెలకొల్పాయి. రాష్ట్ర ఆదాయంలో దాదాపు 70 శాతానికి పైగా హైదరాబాద్ నుంచే వస్తుంది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాష్ట్ర ప్రజలు హైదరాబాద్‌తో సంబంధాన్ని కలిగి ఉన్నారు.

తెలంగాణలో ప్రస్తుత రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. రాష్ట్రంలో బలపడాలని బీజేపీ ఉవ్విళ్లూరుతున్నది. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మారిస్తేనే అందుకు మార్గం సుగమమవుతుందని కమలం పార్టీ బలంగా నమ్ముతున్నది. అందుకే బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిపై కాంగ్రెస్‌తో కలిసి కుట్రలకు తెరలేపింది. రెండు జాతీయ పార్టీల కుమ్మక్కు రాజకీయాల్లో భాగంగా హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేయాలని కుట్రలు పన్నుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని కేంద్ర పాలకులు తమ రహస్య ఎజెండాను అమలు చేస్తున్నారు.

హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించడం వెనుక రహస్య ఎజెండా దాగి ఉన్నది. హైదరాబాద్ ఆదాయాన్ని ఒక్క ప్రాంతానికే పరిమితం చేసి, మిగతా తెలంగాణ జిల్లాలను అంధకారంలోకి నెట్టడమే జాతీయ పార్టీల లక్ష్యం. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మారుస్తున్నారనే కత్తిని తెలంగాణ మెడపై ఉంచి, రాష్ట్రంలో అశాంతి రగిలించాలనే పన్నాగాన్ని ఆ పార్టీలు పన్నుతున్నాయి. ఏపీ విభజన ఒక పనికిమాలిన ప్రయత్నమనేది బీజేపీ వాదన. సాక్షాత్తూ పార్లమెంట్ వేదికగా ప్రధాని మోదీ కూడా తెలంగాణపై అక్కసు వెళ్లగక్కారు. ఢిల్లీలో కుస్తీ, గల్లీలో దోస్తీ వెనుక బలమైన కుట్ర ఉంది. ఆ కుట్రలో భాగంగానే బీజేపీ అభ్యర్థులను గెలిపించడానికి కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థులను బరిలో ఉంచింది. తద్వారా బీఆర్‌ఎస్‌ను బలహీనం చేయాలనేది వారి వ్యూహం. అలా చేస్తే భవిష్యత్తులో తెలంగాణను ఇష్టం వచ్చినట్టు దోచుకోవచ్చనేది వారి ఆలోచన. అందుకే ఆ పార్టీలు కేంద్రపాలిత ప్రాంతంగా మార్చేందుకు హైదరాబాద్‌ను ఎంచుకున్నాయి. బలమైన కేంద్రం.. బలహీనమైన రాష్ట్రం అనేదే ఆ రెండు పార్టీల విధానం.



**బీజేపీ చేస్తున్న ఈ కుట్రకు సీఎం రేవంత్‌రెడ్డి మద్దతుగా నిలుస్తున్నారు. తెలంగాణను అభివృద్ధి చేసి, అగ్రపథాన నిలిపిన కేసీఆర్‌పై కోపం, అక్కసుతోనే వారు అలా చేస్తున్నారనిపిస్తున్నది. హైదరాబాద్‌ను యూటీగా మారిస్తే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు హైదరాబాద్ అడ్డాగా మారుతుంది.**

తెలుగు జాతి రక్తం, స్వేదం, కేసీఆర్ అకుంఠిత దీక్షతో హైదరాబాద్ అభివృద్ధి చెందింది. దేశాభివృద్ధిలో ఎంతో కీలకమైన హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ పెట్టే సోయి లేదు, కేంద్రీయ విద్యా సంస్థలు నెలకొల్పే ఆలోచన లేదు. కానీ, కేంద్రపాలిత ప్రాంతంగా చేస్తామనే ఆలోచన మాత్రం ఆ జాతీయ పార్టీలకు రావడం అత్యంత ఖండనీయం. ఇది కచ్చితంగా తెలంగాణను నమ్మించి గొంతు కోయడమే. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేస్తే కేంద్ర పన్నులు ఉంటాయి. రాష్ట్ర పన్నులుండవు. రాష్ట్ర ఆదాయం పూర్తిగా పడిపోతుంది. దీని ప్రభావం అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పడుతుంది. అప్పుడు ఆ పార్టీల కండ్లు సల్లబడుతాయి.

బీజేపీ చేస్తున్న ఈ కుట్రలను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకుంటుందనుకోవడం ఆ పార్టీ అమాయకత్వమే అవుతుంది. కాంగ్రెస్ పాలకులు బీజేపీకి వంతపాడితే మరో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతుంది. పోరాటాలకు మారుపేరైన తెలంగాణ సమాజం మరోసారి ఏకమవుతుంది. కుట్రదారులను తరిమికొడుతుంది.

# బీసీల సాధికారత దిశగా రాజకీయం

**తెలంగాణ రాజకీయ ప్రస్థానం కొత్త దశ, దిశను ఎంచుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అందుకు సంబంధించిన అంతఃసంఘర్షణ జరుగుతోంది. తెలంగాణ నేలపై అనేక చారిత్రక ఉద్యమాలు జరిగాయి. అన్నింట్లోనూ నిలిచి గెలిచింది తెలంగాణ అస్తిత్వ ఉద్యమమేనన్నది తిరుగులేని సత్యం. రాష్ట్ర అవతరణ తర్వాత నీళ్లు, నిధులు, నియామకాలకు సంబంధించిన బలమైన దారి ఏర్పడింది. ఇప్పుడు అన్నీ చూసిన తెలంగాణ సమాజం కొత్త రాజకీయ కోణం వైపు దృష్టి సారిస్తున్నది.**



**జూలూరు గౌరీశంకర్**

సమాజంలో జరగాల్సిన అత్యంత కీలకమైన మార్పునకు సంకేతంగా నిలిచిన, సమాజంలో సగభాగమైన బీసీల నుంచి ఈ అంతఃసంఘర్షణ మొదలవుతున్నది. ఇప్పుడు తెలంగాణలో రాజకీయ సందిగ్ధత నెలకొన్నది. ఇది ఒక రకంగా సంధికాలంగా మారింది. 'అన్నింట్లో ముందున్నాం, సంపద సృష్టిలో కీలకంగా నిలిచాం. కానీ, ఫలితాలు పొందడంలో ఎందుకు వెనుకబడి ఉన్నాం' అనే ప్రశ్న బీసీలను వెంటాడుతోంది. దాని నుంచే ఒక కొత్త సంఘర్షణ మొదలుకానుంది. జనాభాలో సగానికి పైగా ఉండే తమకు అందుకు తగ్గట్టు సీట్ల వాటా ఏదని అన్ని రాజకీయ పార్టీలను బీసీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ చైతన్యానికి ప్రతిరూపంగానే బీసీల ఓట్లు బీసీలకే వేసుకోవాలనే బలమైన స్వరాలు వినిపిస్తున్నాయి. 'అన్నీ చూసిన బీసీలం. మనల్ని మనం ఎందుకు గెలిపించుకోలేం' అన్న ప్రశ్నలు కూడా బలంగా ఉదయిస్తున్నాయి.

ఈ సంధికాలమే తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మారడానికి కావాల్సిన సరైన తరుణమని కూడా బీసీలు భావిస్తున్నారు. ఈ బీసీ చైతన్యాన్ని కూడా తమవైపు తిప్పుకోవాలని రాజకీయ పార్టీలు పథక రచనలు చేసుకుంటున్నాయి. పదునెక్కిన బీసీ చైతన్యం ముందుకు వస్తే సగభాగంగా ఉన్న తమకు అన్నింటిలో సమవాటా కావాలన్న నినాదం మిన్నంటుతుంది.




ఆ మిన్నంటే దశకు వెళ్లడానికి ఎవరు కొలిమి రాజేస్తారా? అని బీసీ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. బీసీలలో జరుగుతున్న ఈ తండ్లాటని తక్కువగా అంచనా వేసిన రాజకీయ పార్టీలు తప్పకుండా పక్కకుపోయి తీరుతాయి. ఎవరి గెలుపుకైనా తామే ఆధారం అన్న దృఢ నిశ్చయం కలిగిన బీసీలు ఇప్పుడు తమను తాము గెలిపించుకోడానికి సర్వసన్నద్ధం అవుతున్నారు. తెలంగాణ రాజకీయ ముఖచిత్రానికి ఇది సంధికాలం కావచ్చు. కానీ, ఇది బీసీలకు మాత్రం సమరానికి సన్నద్ధమయ్యే చారిత్రకమైన సమయంగా భావిస్తున్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు కావస్తున్నా ఇంకా బీసీ కులాలకు సంపూర్ణ రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం అందడం లేదు. అందుకే బీసీల సాధికారత కోసం బీసీలందరు సంఘటితమై, కలిసికట్టుగా కదిలే సమయం కూడా తెలంగాణ సమాజం తప్పక చూస్తుంది.

**బీహార్‌లో, తమిళనాడులో, ఉత్తరప్రదేశ్‌లో బీసీ కులాలకు సంబంధించిన నేతలు ముఖ్యమంత్రులుగా నిలిచారు. దేశవ్యాప్తంగా ఎన్నో మార్పులు సంభవిస్తున్న ఈ తరుణంలో తెలంగాణలో కూడా బీసీల అస్తిత్వం ఒక ప్రధాన ఎజెండాగా ముందుకు రాబోతోంది. ఇప్పటికే తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక అందులో తమ సంఖ్య ఎంతో బీసీలు లెక్కించుకున్నారు. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు సమప్రాధాన్యం ఇచ్చిన రాజకీయ పార్టీలు ఏవో అంచనాలు కడుతున్నారు.**

రేపు రాబోయే స్థానిక ఎన్నికల్లో తమకు 50 శాతం సీట్లివ్వాలన్న డిమాండ్లతో ముందుకు దూసుకువచ్చేందుకు బీసీ వర్గాలు సన్నద్ధమవుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించింది. ఆ హామీని నెరవేర్చకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు ఎట్లా వెళ్తారో చూస్తామని బీసీలు అనుకుంటున్నారు. జనాభాలో సగం ఉన్న బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ గర్జనలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా మున్సిపాలిటీల చైర్మన్లు, జడ్పీ చైర్మన్లు, గ్రామ పంచాయతీలు.. ఇలా అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం సీట్లు బీసీలకు ఇవ్వాలన్న ఒక ప్రధాన డిమాండ్ ముందుకు రానుంది. ఇదే రాబోయే కొత్త రాజకీయ మార్పునకు సంకేతంగా నిలుస్తుంది.




## ఓటు వేయకపోతే బుల్డోజర్



*బీజేపీకి ఓటు వేయకపోతే తీవ్రమైన పరిణామాలను ఎదుర్కొంటారు. ఓటు వేయనివారికి ఏం జరుగుతుందో మీకందరికి తెలుసు కదా. ఎవరైతే బీజేపీకి ఓటు వేయరో వాళ్ల ఇంటికి బుల్డోజర్లు వస్తాయి.*

**-విజయ్ మల్లాకర్,** *అసోం బీజేపీ ఎమ్మెల్యే*